## మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ



ఇందిర భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 30: సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ మడిపల్లి విక్రమ్ మాతృమూర్తి ఇందిర బుధవారం మరణించారు. ఆమె భౌతికకాయాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకుడు కుమ్మరికుంట్ల వేణు తండ్రి అబ్బయ్య ఇటీవల మరణించగా ఆయన చిత్రపటానికి, తాళ్లకాంపాడ్ మాజీ సర్పంచ్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**శుభకార్యాలకు హాజరు**

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పలుచోట్ల జరిగిన శుభకార్యాలకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. చౌటుప్పల్‌లో జరిగిన దుబ్బాక శ్రీనివాస్‌రెడ్డి, రేణుక దంపతుల కుమారుడి వివాహ వేడుకలో, కేతేపల్లిలో జరిగిన బత్తుల సోమేశ్వరి, యలమంద దంపతుల కుమార్తె పెళ్లిలో, సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన బండి కవిత, ప్రభాకర్‌రెడ్డి దంపతుల కుమార్తె వివాహ వేడుకలో, చింతల చెరువు పూర్ణయ్య, సుజాత దంపతుల కుమార్తె పెళ్లిలో, గిలకత్తుల సతీశ్‌గౌడ్ సోదరుడి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## వివాదాస్పద భూమి రిజిస్ట్రేషన్‌పై విచారణకు కలెక్టర్ ఆదేశం

సూర్యాపేట, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో వివాదాస్పద భూమి పట్టా విషయమై 'రెవెన్యూలో అక్రమార్కులు' శీర్షికతో ఈ నెల 30న నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పందించారు. ఈ విషయమై విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ పి.రాంబాబును నియమించారు. మండల తాసీల్దార్‌తో పాటు ఉద్యోగుల పనితీరుపై విచారణ జరిపి పూర్తి నివేదికను తక్షణమే అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలకు లోబడి పని చేయాలని, ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగించినా, అవినీతికి, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కన్నమ్మ మృతి



పశ్య కన్నమ్మ (ఫైల్)

హుజూర్‌నగర్, ఏప్రిల్ 30: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, స్వాతంత్ర్య సమర యోధురాలు పశ్య కన్నమ్మ (96) బుధవారం కన్నుమూశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆమె పాల్గొన్నారు. 1941లో జరిగిన 8వ ఆంధ్ర మహాసభలో సోదరుడు దొంతిరెడ్డి శంభిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆమె మహిళా సమాఖ్య ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా, భారత జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా పనిచేశారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో మొదటిసారిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారి కుటుంబాలకు, స్వాతంత్ర్య సమరయోధులకు పింఛన్ ఇప్పించడంలో కన్నమ్మ కీలక పాత్ర పోషించారు. కమ్యూనిస్ట్ నాయకురాలిగా ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం.

## 'రాజకీయాలకు అతీతంగా ఇండ్లు మంజూరు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అరిబండి సురేశ్‌బాబు

నేరేడుచర్ల, ఏప్రిల్ 30: ఇందిరమ్మ ఇండ్లను రాజకీయాలకు అతీతంగా అర్హులకు మంజూరు చేయాలని, లేనిపక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు హెచ్చరించారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన డిజైన్‌లో కాకుండా లబ్ధిదారులకు అనుకూలంగా ఇండ్లు నిర్మించుకునే సడలింపు ఇవ్వాలని కోరారు. అగ్ని ప్రమాదంలో ఇండ్లు కోల్పోయిన వారికి, నిరాశ్రయులైన వారికి, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి మొత్తం 3,500 ఇండ్లు కేటాయించినట్లు ప్రకటించారని, పైలట్ గ్రామాలకు పోనూ మిగిలిన ఇండ్లు ఏ గ్రామానికి ఎన్ని మంజూరు చేశారనే విషయాన్ని బహిర్గతం చేయాలని అన్నారు. అనేక గ్రామాల్లో ఇండ్లు, భూములు, ఉద్యోగాలు ఉన్నవారికే ఇండ్లు మంజూరు చేశారని, అనర్హులకు మంజూరు చేసిన లిస్ట్‌ను వెల్లడిస్తే వారికి రద్దు చేస్తారా అని అధికారులను ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, మున్సిపల్ మాజీ చైర్మన్ చందమళ్ల జయబాబు, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు, నాయకుడు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి మహాప్రభో !

● ఓ నిరుపేద కుటుంబం వేడుకోలు



ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్న కోటిలింగం దంపతులు

మునగాల, ఏప్రిల్ 30: వారిది రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం. కాలం కనికరించక గతంలో వారు నివాసం ఉంటున్న పూరిల్లు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అగ్నికి ఆహుతైంది. సర్వం కోల్పోయిన ఆ కుటుంబం తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటోంది. వివరాలిలా ఉన్నాయి.. మునగాల మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన గడ్డం కోటిలింగం, సైదమ్మ దంపతులది నిరుపేద కుటుంబం. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. 2017 సంవత్సరంలో వారింట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పూరి గుడిసె అగ్నికి ఆహుతైంది. ఇంట్లోని నిత్యావసర సరుకులతో పాటు గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ తర్వాత దాతల సహకారంతో దగ్ధమైన ఇంటి స్థలంలోనే పూరిల్లు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, అప్పటి నుంచి నేటి వరకు ఇంటి కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని కోటిలింగం ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తమ గ్రామానికి 16 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినా తనకు ఇల్లు రాలేదని తెలిపారు. అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్నవారికే ఇండ్లు కేటాయించి తమలాంటి వారికి అన్యాయం చేశారని కోటిలింగం ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఏ పార్టీతో సంబంధం లేదని, కూలి పనులు చేసుకొని బతికే తమకు ఇందిరమ్మ ఇల్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించాడు. అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

## 'కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం'

నూతనకల్, ఏప్రిల్ 30: మేడే వేడుకలను గ్రామగ్రామాన ఘనంగా జరుపాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు గంట నాగయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. కేంద్రం కార్మికుల హక్కులను హరిస్తుందని, కనీస వేతన చట్టాన్ని సవరించకుండా శ్రమదోపిడీ చేస్తుందని విమర్శించారు. సమావేశంలో నాయకులు రాములు, పాపయ్య, సైదులు, వెంకటయ్య, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌కు నిరసన సెగ

● పథకాల అమలుపై నిలదీసిన సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు
● ప్రభుత్వ పథకాలు అనర్హులకు కేటాయించారని ధ్వజం



ఎమ్మెల్యే మందుల సామేల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 30: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు సొంత పార్టీ నాయకుల నుంచే నిరసన సెగ తగిలింది. ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధ్వజమెత్తారు. సూర్యాపేటలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ పర్యవేక్షణలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సామేల్‌తో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్‌ను సన్మానిస్తున్న సమయంలో తుంగతుర్తి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సామేల్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అర్హులకు సంక్షేమ పథకాలు దక్కకుండా అనర్హులకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఏండ్ల తరబడి కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నాయకులను, కార్యకర్తలను ఎమ్మెల్యే గుర్తించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం ఇవ్వడం లేదని, ఇదేమని అడిగేందుకు వెళ్లే తమను దగ్గరకు రానివ్వడం లేదని, మీతో మాట్లాడే పనిలేదని అంటున్నారని వాపోయారు. కాగా, ఎమ్మెల్యే సామేల్ కలుగజేసుకొని తానే పార్టీకి కొత్త అని, మీలో ఎవరు కొత్తవారో, ఎవరు పాతవారో నాకేలా తెలుస్తుందని అనడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే సీనియర్ నాయకులు కలుగజేసుకొని నాయకులు, కార్యకర్తలను సర్దిచెప్పారు.

**మహిళలకు గౌరవం లేకుండా పోయిందని ఆవేదన**

కొందరు నాయకురాళ్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు గౌరవం లేకుండా పోయిందని, కనీసం సమావేశంలో మహిళలకు కుర్చీలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సైతం తాము స్వేచ్ఛగా తిరిగామని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో తిరగలేకపోతున్నామని అన్నారు. కష్టపడి పని చేసే నాయకులు, కార్యకర్తలకు పదవులు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జయ స్కూల్ కరస్పాండెంట్ జయ వేణుగోపాల్



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న కాకతీయ స్కూల్ యాజమాన్యం



సాయిసృజన



ప్రణవి



శ్రీజ



హర్షిత



ప్రజ్ఞా రెడ్డి



సుదీపా రెడ్డి



సాయి గోకుల్



శిశిర



కశ్యప్‌రామ్

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని జయ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఐదుగురు విద్యార్థులు 587 మార్కులు సాధించగా, 580కి పైన 15 మంది, 570కి పైగా 52 మంది, 560కి పైగా 106 మంది, 550కి పైగా 154 మంది విద్యార్థులు మార్కులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ తెలిపారు. వి.హాసిని, కె.శ్రేష్ఠ, ఎం.అనన్య, ఎం.శ్రీదేవి 587, కె.శరణ్య 586, లోకేశ్ 585, సాయి చర్విత, శ్రీజ 584, చాణక్య, హర్షవర్ధిని 583, రేవంత్‌రెడ్డి, మన్విత, ప్రగతి, వేద 580 మార్కులు సాధించారు.

**సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థులు**

జిల్లా కేంద్రంలోని సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించినట్లు కరస్పాండెంట్ ఆర్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన ఎస్.సాయిసుజన 595, బి.ప్రణవి 588, జి.శ్రీజ 583, పి.హర్షిత 581, వై.ప్రజ్ఞారెడ్డి 579, ఎస్.సాయిగోకుల్,వై.శిశిర,ఎన్.సుదీపారెడ్డి 577, ఐ.కశ్యప్ రామ్ 575, ఎం.సాయిరిశ్విత్ 573, జి.నితీషావర్ధిని 571, న్యూ విజన్ స్కూల్‌లో ఎండీ.యాస్మిన్ 579, ఎండీ.అబియా 576, ఎన్.సాయిచరణ్‌రెడ్డి, పి.వీక్షిత 555 మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ఆర్.ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ టి.మురళీధర్, సుక్రుతారెడ్డి అభినందించారు.

**ప్రతిభ చూపిన కాకతీయ విద్యార్థులు**

జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ గుండా హరినారాయణ, ప్రిన్సిపాల్ గాలి రమేశ్ తెలిపారు. విద్యార్థిని ఎ.శ్రీచందన 576 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే 560కి పైగా 10 మంది, 500కు పైగా 36 మంది విద్యార్థులు మార్కులు సాధించారని వెల్లడించారు. మొత్తం 52 మంది విద్యార్థులతో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం.. అన్నదాతల దైన్యం

● వాతావరణ మార్పులతో రైతుల ఆందోళన
● పగలు ఎండ, సాయంత్రం ఉరుములు, మెరుపుల నేపథ్యంలో కలవరపడుతున్న రైతులు



నేరేడుచర్ల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులపై పట్టాలు కప్పిన రైతులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 30: ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ మార్పులు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. ఉదయం ఎండ ఉంటున్నా సాయంత్రం ఉరుములు, మెరుపులతో పాటు కారు మబ్బులు కమ్ముకొస్తుండడంతో రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాలతో పాటు కల్లాల వద్ద పోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. పొద్దంతా ధాన్యం ఆరబోయడం, సాయంత్రమైతే కుప్పలు పోసి పట్టాలు కప్పడమే సరిపోతుంది. బుధవారం పగలు మొత్తం ఎండ కొట్టగా సాయంత్రం అయ్యేసరికి మబ్బు పట్టడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పంట చేతికొచ్చి అమ్ముకోవడానికి ఆరబోసుకుంటే ఈ సమయంలో ఎక్కడ అకాల వర్షం కొంపముంచుతుందోనని ఆవేదన చెందుతున్నారు. నేరేడుచర్ల మండలంలో యాసంగి సీజన్‌లో సుమారు 24,562 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. కోతలు దాదాపు పూర్తయి పంట చేతికొచ్చింది. ఈ సమయంలో కొంతమంది రైతులు నేరుగా ట్రాక్టర్లలో పోసి రైస్ మిల్లులకు తరలించగా మరి కొందరు రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర కోసం ధాన్యం తరలించారు. మరికొంత మంది రైతులు స్టాక్ పెట్టుకోవడం కోసం పొలాల్లోనే ధాన్యం ఆరబోసుకున్నారు. అయితే, అకాల వర్షాలతో రైతులు కలవరపడుతున్నారు.

**లారీలు రాక నిలుస్తున్న రవాణా**

నేరేడుచర్ల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని రవాణా చేయడానికి సరిపడా లారీలు రావడం లేదు. దీంతో ఉదయం మొత్తం ధాన్యం ఆరబోసి సాయంత్రం కుప్ప పోసి పట్టాలు కప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్ 8న ప్రారంభమైన కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 52 మంది రైతులకు చెందిన 11,175 బస్తాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించారు. ఇంకా పది మంది రైతులకు సంబంధించిన నాలుగు వేల బస్తాలు కాంటా కూడా వేయక పోవడం, లారీలు సక్రమంగా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేమీ లేక సొంత ఖర్చులతో ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. అదే విధంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు చొరవ తీసుకొని లారీలను ఎక్కువ మొత్తంలో కేటాయించి ధాన్యాన్ని తరలించాలని రైతులు కోరుతున్నారు.

**పొలాల్లోనే ధాన్యం రాశులు**

వరి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో కొందరు రైతులు ధాన్యాన్ని పొలాల్లోనే రాశులుగా పోసి ఉంచారు. అకాల వర్షాల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి పట్టాలు తీసుకొచ్చి ధాన్యం రాశులపై కప్పి బందోబస్తు చేస్తున్నారు. అయితే, భారీగా వీస్తున్న ఈదురు గాలులకు పట్టాలు లేచిపోయి ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం



తిరుమలగిరిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల మధ్య నిలిచిన వర్షపు నీరు

తిరుమలగిరి, ఏప్రిల్ 30: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోయింది. బుధవారం కురిసిన అకాల వర్షానికి తిరుమలగిరిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగకపోవడంతోనే ధాన్యం తడిసిందని రైతులు వాపోయారు. అధికారులు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

## మట్టి అక్రమ రవాణాపై అధికారుల చర్యలు

పాలకవీడు, ఏప్రిల్ 30: మండలంలోని జాన్‌పహాడ్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా పోలీస్, రెవెన్యూ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. 319 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో జేసీబీలను ఉపయోగించి టిప్పర్ల సాయంతో మట్టిని రవాణా చేస్తున్న వారిని గుర్తించి రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకొని రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ కమలాకర్ మాట్లాడుతూ మైనింగ్ అధికారుల అనుమతి లేకుండా మట్టి రవాణా చేయొద్దని సూచించారు.

## బాలికపై లైంగిక దాడికి యత్నం

గరిడేపల్లి, ఏప్రిల్ 30: బాలికపై యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో మంగళవారం రాత్రి కరెంట్ పోయిన సమయంలో ఇంటి ముందు ఆడుకుంటున్న పదేళ్ల బాలికను గదిలోకి ఎత్తుకెళ్లిన యువకుడు ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

## నేటి నుంచి వాలీబాల్ ఉచిత శిక్షణ

మేళ్లచెర్వు, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు మే 1వ తేదీ నుంచి జూన్ 6 వరకు వాలీబాల్ ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పీడీ ఉపేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



మేళ్లచెర్వు: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## భూ భారతితో రైతుల సమస్యల పరిష్కారం

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మేళ్లచెర్వు, ఏప్రిల్ 30: భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మేళ్లచెర్వులో భూ భారతి చట్టంపై బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం త్వరలో గ్రామ రెవెన్యూ అధికారులను నియమించి రైతుల సమస్యలు అక్కడికక్కడే త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు, ప్రత్యేకాధికారి పద్మ, తాసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ అజ్గర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**ఒంటిపై పెట్రోల్ పోసుకొని రైతు నిరసన**

చింతలపాలెం: మండల కేంద్రం చింతలపాలెంలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ రైతు తన భూ సమస్య పరిష్కారం కావడం లేదని ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిరసన వ్యక్తం చేశాడు. రైతు సమస్యను విన్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ భూ భారతి చట్టంతో సమస్యకు పరిష్కారం దొరుకుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● బీఆర్‌ఎస్ కార్మిక విభాగం మండల మాజీ అధ్యక్షుడు గణేశ్

గరిడేపల్లి, ఏప్రిల్ 30: బీఆర్‌ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం మండల మాజీ అధ్యక్షుడు పిట్ట గణేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో కార్మికులకు ఎంతో ఉపాధి దొరికిందని, నేడు కాంగ్రెస్ పాలనలో కార్మికులకు పని దొరకక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఐకమత్యంతో బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గరిడేపల్లి మండలంలో మేడే ఉత్సవాలకు బీఆర్‌ఎస్‌కేవీ, అనుబంధ సంఘాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 30: హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం కొలువుదీరింది. అధ్యక్షుడిగా సాముల రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జక్కుల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా చనగాని యాదగిరి, సంయుక్త కార్యదర్శిగా సురేశ్, గ్రంథాలయ కార్యదర్శిగా విశ్వనాథ్, కోశాధికారిగా గోపాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరావు, నాగార్జున, సైదా హుస్సేన్, ప్రశాంత్, రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు.

## ఎంఈఎఫ్ సభ్యత్వ నమోదు

నేరేడుచర్ల, ఏప్రిల్ 30: మాదిగ ఉద్యోగుల సంఘం (ఎంఈఎఫ్) ఉమ్మడి నల్లగొండ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నేరేడుచర్లలోని ఏ వన్ ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేందర్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న, సిద్ధ జాన్ విల్సన్, మామిడి సైదన్న, డాక్టర్ పగడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

మఠంపల్లి, ఏప్రిల్ 30: బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రం మఠంపల్లిలో బీసీ నాయకులతో కలిసి బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల సాధన కోసం త్వరలో అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి, బీసీ హక్కుల సాధన సమితి నాయకుడు కొమ్రరాజు వెంకట్, బుర్రి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సైదులు



సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

మోతె, ఏప్రిల్ 30: ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మేడేను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సీపీఎం మోతె మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ఫలితంగా 8 గంటలు చేయాల్సిన పని 12 గంటలు అయిందని, కార్మికులకు కనీస వేతనాలు కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ మే 1వ తేదీన మండల వ్యాప్తంగా కార్మిక వర్గం మేడే వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ముల్కూరు గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు నాగం మల్లయ్య, దోసపాటి శ్రీను, జంపాల స్వరాజ్యం, వెలుగు మధు, చేగువేరా, ఎడమ పద్మ, మల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## 'నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి'

గరిడేపల్లి, ఏప్రిల్ 30: నిరుపేదలకు, కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గరిడేపల్లిలోని ఎంఎస్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొలువులు లేక నిరుద్యోగ యువత పరిస్థితి దయనీయంగా ఉన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే పాలనలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పేదలందరికీ ఉచిత ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో జిలకర పెంటయ్య, పోలిపల్లి లచ్చయ్య, నాగుల్‌మీరా, ఎం.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.